
సాక్షి సిద్దిపేట

ఆదివారం । 12 । మే । 2024





క్లుప్తంగా

ఓటు హక్కును వినియోగించుకోవాలి

● ఎన్నికల అధికారి మిక్కిలినేని మనుచౌదరి

సిద్దిపేటరూరల్: లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి శనివారం తెలిపారు. ఈనెల 13న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పోలింగ్ రోజున ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, కార్యాలయాలు, పరిశ్రమలు తమ ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవును ప్రభుత్వం మంజూరు చేసిందని, దీంతో అందరూ తప్పకుండా ఓటు వేయాలని జిల్లాలోని ఓటర్లను విజ్ఞప్తి చేశారు.

సామూహిక వ్రతాలు



వ్రతమాచరిస్తున్న భక్తులు

వర్గల్(గజ్వేల్): నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రంలో శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చిన భక్తులు హరిద్ర నది వాగులో పుణ్యస్నానాలాచరించారు. దంపతులు కుటుంబసభ్యులతో కలిసి వ్రతమండపానికి చేరుకున్నారు. భక్తిశ్రద్ధలతో వ్రతమాచరించి మొక్కులు తీర్చుకున్నారు. గర్భగుడిలో నాచగిరీశుని దర్శించుకుని తరించారు. క్షేత్రంలో 28 సత్యనారాయణ వ్రతాలు, 8 కల్యాణాలు, 12 నిజాభిషేకాలు, 15పైగా సేవలు జరిగాయని ఆలయ ఈఓ అన్నపూర్ణ తెలిపారు. భక్తులతో క్షేత్రం కిటకిటలాడగా, ఈఓ పరివారం ఇబ్బంది కలగకుండా పర్యవేక్షించారు.

ముగిసిన టీఎస్‌ఈఏపీసెట్

సిద్దిపేటఅర్బన్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీఎస్‌ఈఏపీ సెట్ పరీక్షలు శనివారం ముగిశాయి. పొన్నాల శివారు ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు రోజుల పాటు పరీక్షలు నిర్వహించారు. శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన ఇంజినీరింగ్ పరీక్షకు 100 మందికిగాను 98 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, అబ్జర్వర్ తిరుపతి, టీసీఎస్ కుమార్, పీఆర్వో రఘు తదితరులు పర్యవేక్షించారు.

ఇక ప్రలోభాలకు ఎర..!


ముగిసిన ప్రచారపర్వం

● చివరి రోజు హాజరైన రాజకీయ పార్టీల అగ్రనేతలు
● రేపే పోలింగ్



లోకసభ ఎన్నికల్లో భాగంగా ప్రచార పర్వానికి తెరపడింది. పోలింగ్ సమయానికి 48 గంటల ముందు శనివారం సాయంత్రం 6 గంటలకు నిబంధనల ప్రకారం.. మైక్‌లు మూగబోయాయి. అప్పటి వరకు నాయకులు ప్రచారాన్ని హోరెత్తించారు. కాగా, ఇక ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడమే మిగిలింది.

సాక్షి, సిద్దిపేట : పటాన్‌చెరులో సీఎం రేవంత్‌రెడ్డి, గజ్వేల్‌లో బీఆర్‌ఎస్ రోడ్ షో కార్నర్ మీటింగ్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. సిద్దిపేట, గజ్వేల్‌లలో బీజేపీ అభ్యర్థి రఘునందన్ బైక్ ర్యాలీ, రోడ్‌షోలు నిర్వహించారు. సోమవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు ఏర్పాట్లు ముమ్మరంగా చేశారు.





ప్రచారంలో అగ్రనేతలు

ఎన్నికల ప్రచారంలో ఆయా రాజకీయ పార్టీలకు చెందిన అగ్రనేతలు పాల్గొన్నారు. అభ్యర్థులు ఎక్కువగా రోడ్ షోలు, ర్యాలీలు, కార్నర్ మీటింగ్, సభలు నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌కు మద్దతుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, గోవా సీఎం ప్రమోద్ సావంత్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిలు, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు కోసం ఏఐసీసీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ ప్రచారం చేశారు.

నేడు ఎన్నికల సామగ్రి పంపిణీ

జిల్లాలోని నియోజకవర్గాల వారీగా పోలింగ్ సిబ్బందికి సామగ్రిని ఆదివారం పంపిణీ చేయనున్నారు. సిద్దిపేట నియోజకవర్గానికి గాను ఇందూరు ఇంజినీరింగ్ కళాశాల, దుబ్బాకకు .. లచ్చపేటలోని టీఎస్ మోడల్ స్కూల్, గజ్వేల్‌కు ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్, హుస్నాబాద్‌కు గాను మోడల్ స్కూల్‌లో సామగ్రిని సిబ్బందికి అందించనున్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌ను బొందపెట్టాలి

● బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తేనే ప్రజల హక్కుల రక్షణ
● కార్నర్ మీటింగ్ మాజీమంత్రి హరీశ్‌రావు



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్: ఒకరు రిజర్వేషన్లు వద్దంటరు.. మరొకరు దేవుడి మీద ఒట్లు పెడ్తారని బీజేపీ, కాంగ్రెస్‌లనుద్దేశించి పరోక్షంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లను బొందపెట్టి బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తేనే తెలంగాణ ప్రజల హక్కులకు రక్షణ లభిస్తుందన్నారు. ప్రభుత్వాల మెడలు వంచి పని చేయిస్తామన్నారు. శనివారం గజ్వేల్‌లోని ఇందిరా పార్కు చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ వల్ల తెలంగాణ ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాకలో బండకేసి కొట్టారన్నారు. 5 నెలల కాంగ్రెస్ పాలనపైనా ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి తుంగలో తొక్కారని మండిపడ్డారు. మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో పుట్టెడు కష్టాలు

సిద్దిపేటజోన్: కేసీఆర్ హయాంలో పుట్ల కొద్దీ వడ్లు పండితే రేవంత్ హయాంలో పుట్టెడు కష్టాలు వచ్చాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. శనివారం సిద్దిపేట జిల్లా సిద్దిపేట పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారానికి వచ్చాక విద్యుత్, తాగు, సాగు నీటి కష్టాలు వచ్చాయన్నారు. ప్రధాని మాటల్లో నీతి లేదని, సీఎం మాటల్లో రీతి లేదని ఎద్దేవా చేశారు. ఇద్దరూ ఇద్దరేనని విమర్శించారు.

ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్ల దోపిడీ



సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

● ఢిల్లీ, గల్లీలో లేని బీఆర్‌ఎస్‌కు ఎందుకు ఓటు వేయాలి?
● బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్

సిద్దిపేటకమాన్/ గజ్వేల్‌రూరల్: మూడవ సారి మోదీ ప్రధాని కావడం ఖాయమని బీజేపీ మెదక్ లోక్‌సభ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేటలో, గజ్వేల్ పట్టణంలో శనివారం రోడ్ షో, బైక్ ర్యాలీ నిర్వహించారు. సిద్దిపేట రూరల్ పోలీసు స్టేషన్ చౌరస్తా నుంచి ముస్తాబాద్ చౌరస్తా, విక్టరీ చౌరస్తా మీదుగా సిద్దిపేట పాత బస్టాండ్ వరకు, ప్రజ్ఞాపూర్ నుంచి గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వరకు నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. అలాగే అనంతరం సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఈ గడ్డ మీద పుట్టినోడు రఘునందన్ రావు, నేను లోకల్ అని అన్నారు. మెదక్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయించడానికి బీఆర్‌ఎస్‌కు సిద్దిపేటలో అభ్యర్థులు దొరకలేదా అని ప్రశ్నించారు. సిద్దిపేటకు చెందిన వారికి హరీశ్‌రావు ఏమైనా పదవులు ఇచ్చిండా? అని ప్రశ్నించారు. ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వలేదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఒక్క సీటు గెలువదన్నారు. ఇటు ఢిల్లీలో అటు గల్లీలో లేని బీఆర్‌ఎస్‌కు ఓటు ఎందుకు వేయాలని ప్రశ్నించారు. కార్యక్రమాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, బాసంగారి వెంకట్, బీజేపీ నాయకులు గురువారెడ్డి, ప్రసాద్‌రావు, రాంరెడ్డి, శ్రీనివాస్, మనోహర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ సతీమణి మంజుల శనివారం పట్టణంలో పలు వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

పోలింగ్ ముగిసే వరకు అప్రమత్తం

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రామ్మూర్తి

హుస్నాబాద్‌రూరల్: పల్లెలో పోలింగ్ ముగిసే వరకు అధికారులు జాగ్రత్తగా ఉండాలని, పోలింగ్ సరళిని అప్పటికప్పుడు పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రామ్మూర్తి ఆదేశించారు. శనివారం ఐవోసీ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులకు, మోడల్ స్కూల్లో ఈవీఎంల సామగ్రి తరలింపుపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈవీఎంల పంపిణీ చేసే అధికారులు 11 రకాల రిపోర్టులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈవీఎంలు మొరాయించకుండా తగిన జాగ్రత్తలతో సకాలంలో పోలింగ్ ప్రారంభించాలని చెప్పారు. తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



ఈవీఎంల పంపిణీపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ రామ్మూర్తి

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

అదనపు డీసీపీ మల్లారెడ్డి



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దని అదనపు డీసీపీ మల్లారెడ్డి హెచ్చరించారు. శనివారం శివ ప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి విధులకు సంబంధించిన బుక్‌లెట్ ఇచ్చామన్నారు. అందరూ ఇది చదువుకొని విధులు నిర్వహించాలన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్, ఎన్నికల సామగ్రి రక్షణ బాధ్యత రూట్ మొబైల్ అధికారులదేనన్నారు. రూట్ మొబైల్‌లోని పోలింగ్ కేంద్రాల వద్ద 24 గంటలు పెట్రోలింగ్ చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వద్దని, రాబోయే 72 గంటలు చాలా ముఖ్యమన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎన్నికల నియమావళిని తు.చ. తప్పకుండా పాటించాలన్నారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ప్రజలు తమ ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకునేలా అన్ని చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీను, చేర్యాల ఎస్‌ఐ దామోదర్, మద్దూరు ఎస్‌ఐ యూనస్ అహ్మద్ అలీ, కొమురవెల్లి ఎస్‌ఐ నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటఅర్బన్: లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా నిర్వహించాలని సిద్దిపేట ఏసీపీ మధు అన్నారు. పొన్నాల ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఎన్నికల ముందు, ఎన్నికల రోజు నిర్వహించాల్సిన విధులపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, ఆర్‌ఐ విష్ణుప్రసాద్, రూట్ మొబైల్ అధికారులు, పోలింగ్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో జరిగేలా..

గజ్వేల్‌రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కోలా అభిరాం గార్డెన్స్‌లో సిబ్బందికి ఎన్నికల విధులపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ సీఐ సైదా, అదనపు సీఐ ముత్యంరాజు, ట్రాఫిక్ సీఐ మురళి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చడం సాధ్యం కాదు

మాజీ మంత్రి పెద్దిరెడ్డి

హుస్నాబాద్: బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని ప్రచారం చేస్తూ ఆరు గ్యారంటీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి అన్నారు. హుస్నాబాద్ బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ ప్రభుత్వానికైనా రాజ్యాంగాన్ని మెరుగు పరిచే పరిస్థితి వస్తే తప్ప దాన్ని మార్చడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి సరితూగే వ్యక్తి కనపడటం లేదని అన్ని సర్వేలు చెబుతున్నాయని తెలిపారు. ఎంపీ బండి సంజయ్ ప్రజల సమస్యలపై పోరాడే నాయకుడన్నారు. ప్రజలే ఆయన కుటుంబమని నమ్ముకొని పోటీ చేస్తున్నాడన్నారు. కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గాన్ని రూ.12వేల కోట్లతో అభివృద్ధి చేశాడని, ఇవేమి తెలియక కొందరు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, నాయకులు కొత్తపల్లి అశోక్, బత్తుల శంకర్ బాబు, చిట్టి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి

122 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

సీపీ అనురాధ



హుస్నాబాద్‌లో స్ట్రాంగ్ రూం వద్ద సీపీ అనురాధ, పోలీస్ అధికారులు

హుస్నాబాద్: వచ్చే 48 గంటలు చాలా కీలకమని, అక్రమంగా మద్యం, డబ్బులు తరలించే అవకాశం ఉన్నందున పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీపీ డాక్టర్ బి. అనురాధ సూచించారు. హుస్నాబాద్ పట్టణంలోని మోడల్ స్కూల్ ఉన్న స్ట్రాంగ్ రూం, పోలింగ్ కేంద్రం, జిల్లెల్లగడ్డలోని పోలింగ్ కేంద్రాన్ని ఆమె శనివారం సందర్శించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, కేంద్ర బలగాలు ఇతర సిబ్బంది 2,482 మందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 1,010 పోలింగ్ స్టేషన్లల్లో 122 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీపీ సతీష్, సీఐ శ్రీనివాస్, ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఎస్సై మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు బంద్

సిద్దిపేటకమాన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్‌లు రెండు రోజులు మూసివేయాలని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జె.మర్ఫీ, సీఐ శ్రీనివాస్ ఆదేశించారు. శనివారం వారు మాట్లాడారు. జిల్లాలోని 93 మద్యం దుకాణాలు, 16 బార్ అండ్ రెస్టారెంట్లను ఈనెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మూసివేయాలన్నారు. సిద్దిపేటలోని మద్యం దుకాణాలకు సాయంత్రం ఎక్సైజ్ అధికారులు సీల్ వేశారు. నిబంధనలు అతిక్రమించి మద్యం దుకాణాలు తెరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిద్దిపేట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు కవిత, విజయ్, కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దిపేటలో మద్యం దుకాణానికి సీల్ వేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

నీటి గుంతలో పడి తమ్ముడి మృతి

● భయపడి విషయాన్ని మార్చి చెప్పిన అన్న
● రామవరంలో ఘటన

అక్కన్నపేట(హుస్నాబాద్): నీటిలో గుంతలో పడి బాలుడు మృతిచెందిన ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం రామవరంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలుడు మేడిచెలిమి సాయికిరణ్(6) తన అన్న ఆదిత్యతో కలిసి ఈత కొట్టేందుకు గ్రామంలోని భావానుల కుంట వద్దకు వెళ్లాడు. ఈత రాక సాయికిరణ్ ప్రమాదవశాత్తు గుంతలో పడి మునిగిపోయాడు. దీంతో భయపడిన ఆదిత్య ఇంటికెళ్లి తమ్ముడు నీటిలో పడి మునిగి చనిపోయాడని చెబితే తల్లిదండ్రులు తిడతారని భావించి, గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఎత్తుకు వెళ్లారని చెప్పాడు. దీంతో హుటాహుటిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు ఆదిత్యను విచారించగా అసలు విషయాన్ని తెలిపాడు. కుంట వద్దకు వెళ్లి ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టగా సాయికిరణ్ మృతదేహం బయటపడింది.

వడదెబ్బతో మహిళ మృతి

మర్కూక్(గజ్వేల్): వడదెబ్బతో మహిళ మృతి చెందిన సంఘటన ఇప్పలగూడెంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కత్తెరపాక లక్ష్మి (50) ఉపాధి హామీ పథకం కూలీ. ఆమె రోజూ పనికి వెళ్తుంది. ఇటీవల ఉష్ణోగ్రతలు పెరగగా.. రెండు రోజుల క్రితం వడదెబ్బ తగిలింది. అయినా ఆరోగ్యం గురించి పట్టించుకోకుండా తన బంధువులు చనిపోయారని చివరి చూపునకు గాను ములుగు, గొల్లపల్లి గ్రామాలకు సైతం వెళ్లి వచ్చింది. కాగా వడదెబ్బ ప్రభావం ఎక్కువై ఆమె శనివారం సాయంత్రం ఇంట్లో చనిపోయింది. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని అల్వాలలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పుల్ల పరుశరాములు (35) ప్లంబర్ పనులు చేసుకుంటూ భార్య లావణ్య, ఇద్దరు కుమారులు, కూతురిని పోషించుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి స్లాబుపై ప్లంబర్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు పరుశరాములుకు కరెంట్ షాక్ కొట్టి పడిపోయాడు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తీసుకెళ్లే లోపు మృతి చెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిని పరుశరాములు తెలిపారు.

నగదు పట్టివేత: కేసు నమోదు

సిద్దిపేటరూరల్: ఓటర్లకు పంచేందుకు సిద్ధంగా ఉన్న నగదును ఎన్నికల నిఘా బృందం అధికారులు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ అపూర్వరెడ్డి శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిన్నగుండవెల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కిషన్‌రెడ్డి బీఆర్‌ఎస్ తరఫున ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారని గుర్తు తెలియని వ్యక్తులు ఎన్నికల నిఘా బృందానికి సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడి వెళ్లి కిషన్ రెడ్డి ఇంట్లో తనిఖీలు చేపట్టగా ఎలాంటి ఆధారాలు లేని రూ.1,22,000 నగదు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మల్లన్న సన్నిధిలో కేరళ పోలీస్ అధికారి



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామిని కేరళ పోలీస్ అధికారి(ఐజీ) జి.లక్ష్మణ్ శనివారం దర్శించుకున్నారు. స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ శాతాన్ని పంపాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

సిద్దిపేటరూరల్: జిల్లావ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా జరిగే పోలింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు జిల్లా ఎన్నికల అధికారికి పంపించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి.. కంప్యూటర్ ఆపరేటర్లను ఆదేశించారు. శనివారం ఈనెల 13న లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జరిగే పోలింగ్ శాతం వివరాల సేకరణకు నియోజకవర్గాలవారీగా నియమించిన కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్లకు కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని 4 శాసనసభ సెగ్మెంట్ల పరిధిలో పోలింగ్ శాతాన్ని ప్రతి రెండు గంటలకోకసారి, సాయంత్రం 6 గంటల తర్వాత పూర్తి వివరాలు తెలుసుకొని సెక్టర్ అధికారులతో సంప్రదించి జిల్లా ఎన్నికల అధికారికి పంపించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ అబ్దుల్ రహమాన్, ఎలక్షన్ సూపరింటెండెంట్ మదుసూధన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను గురుకులాల్లో చేర్పించండి

దుబ్బాకరూరల్: పదో తరగతి పాసైన విద్యార్థులను ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చేర్పించాలని దుబ్బాక మైనార్టీ గురుకుల పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులను కోరారు. శనివారం మండలంలోని హబ్సిపూర్, తిమ్మాపూర్, పద్మనాభునిపల్లి, లచ్చపేట గ్రామాల్లో ఇంటింటి తిరుగుతూ విద్యార్థుల తల్లింద్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాల అసిస్టెంట్ ఎండీ హమీదుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలో చేర్పించకుండా ప్రభుత్వ గురుకులాల్లో చేర్పించాలన్నారు. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యాబోధనతో పాటుగా వసతి, భోజనం సదుపాయం ఉంటుందన్నారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీలో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. వివరాలకు 73311 70826, 98855 95256, 96525 95640 నంబర్లలో సంప్రదించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పీఈటీ షాదుల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ

సిద్దిపేటజోన్: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతకు క్రికెట్ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ రావు పేర్కొన్నారు. శనివారం రాత్రి సిద్దిపేట జిల్లా స్టేడియంలో క్రికెట్ శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మినీ స్టేడియంలో త్వరలో ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 29 ప్రాంతంల్లో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా క్రికెట్ శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. సుమారు 3 వేల మంది క్రీడాకారులు శిక్షణ పొందుతన్నట్టు పేర్కొన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు సహకారాన్ని తీసుకొని సిద్దిపేట స్టేడియంలో మరిన్ని వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారికి అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్స్ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు దలజిత్ సింగ్, దేవరాజ్, రాజేందర్, సిద్దిపేట అసోసియేషన్ కార్యదర్శి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.